



కంట్రోల్‌రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

అంతా ప్రచార యావ!



కొండల ప్రాంతంలో కేటాయించిన జగనన్న ఇళ్ల స్థలాలు

- కొవిడ్ సాయం : రూ.1,000
- జగనన్న అమ్మఒడి : రూ.58,000
- ఇంటి స్థలం : రూ.6,00,000
- ఇల్లు : 2,50,000

- మొత్తం లబ్ధి : 9,09,000

..ఇదీ ఇటీవల 'గడప గడపకూ సంక్షేమం' పేరిట వలంటీర్ల ద్వారా శ్రీకాకుళంలో ఓ లబ్ధిదారుడికి వైసీపీ ప్రభుత్వం పంపిణీ చేసిన కరపత్రం. దీనిని చూసి ఆ లబ్ధిదారుడు ఒక్కసారిగా అవాక్కయ్యాడు. కొండలు, గుట్టలపై తనకు ఇచ్చిన స్థలం విలువ రూ.50 వేలు కూడా ఉండదని, అటువంటి రూ.6 లక్షల లబ్ధి చూపడం విడ్డూరంగా ఉందని వాపోయాడు. ఇల్లు నిర్మాణానికి రూ.2.50 లక్షలు ఇవ్వకుండానే మంజూరైపోయినట్టు కరపత్రంలో ప్రచురించడం అన్యాయమని పేర్కొన్నాడు. వైసీపీ ప్రభుత్వం తమకు ఇచ్చింది తక్కువ.. ప్రచారం ఎక్కువ చేస్తోందని గగ్గోలు పెడుతున్నాడు.

- వైఎస్సార్ సున్నా వడ్డీ (డ్వాక్రా) : రూ.4,948
- కొవిడ్ సాయం : రూ.1,000
- జగనన్న అమ్మఒడి : రూ.58,000
- వైఎస్సార్ ఆసరా : రూ.26,248
- వైఎస్సార్ నేతన్న నేస్తం : రూ.96,000
- ఇంటి స్థలం : రూ.6,00,000

- మొత్తం లబ్ధి : 7,86,196

..ఇదీ ఉమ్మడి జిల్లాలోని పాలకొండకు చెందిన ఓ లబ్ధిదారుడికి వైసీపీ ప్రభుత్వం పంపిణీ చేసిన కరప్రతంలో లబ్ధి జాబితా. ఇందులో నేతన్న నేస్తం ద్వారా నాలుగు విడతల్లోనూ తొలివిడత సాంకేతిక కారణంగా తనకు డబ్బులు అందలేదని లబ్ధిదారుడు పేర్కొన్నాడు. మూడు విడతల్లో రూ.72 వేలు ఇవ్వగా.. కరపత్రంలో రూ.96 వేలు చూపడం అన్యాయమని వాపోతున్నాడు. అలాగే తనకు ఎటువంటి ఇంటి స్థలాన్ని మంజూరు చేయకుండానే ఇచ్చినట్టు కరపత్రంలో ముద్రించారని పేర్కొంటున్నాడు. కరపత్రంలో ఉన్న వివరాల మేరకు తనకు పట్టా ఇవ్వాలంటూ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాడు.



- సెంటు స్థలం ధర రూ.6 లక్షలంట
- ఇళ్లు నిర్మించని వారికీ రూ.2.5 లక్షల లబ్ధి
- కరోనా సమయంలోనూ రూ.వెయ్యి సాయం
- ఇటీవల వలంటీర్లతో కరప్రతాల పంపిణీ
- వీటిని చూసి విస్తుపోతున్న లబ్ధిదారులు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

'చేసింది గోరంత.. చెప్పుకునేది కొండంత' అన్న చందంగా.. వైసీపీ ప్రచారం పతాకస్థాయికి చేరింది. ఇటీవల జిల్లాలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి.. 'గడప గడపకూ సంక్షేమం' పేరిట కరపత్రాలు పంపిణీ చేశారు. 'చెప్పాడంటే.. చేస్తాడంతే' అంటూ.. సీఎం జగన్ ఇచ్చిన హామీల్లో 129కి గానూ 128 అమలు చేసినట్టు ఆ ప్రచార పత్రాల్లో ముద్రించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్కో కుటుంబానికి కల్పించిన లబ్ధి వివరాల ను ఆ పత్రంలో నమోదు చేసి లబ్ధిదారులకు అందజేశారు. 99 శాతం హామీలు అమలు చేశారని పేర్కొనడం.. లబ్ధి విలు వ ఎక్కువ చూపడంతో.. ఆ కరపత్రాలను చూసి ప్రజలు విస్తుపోతున్నారు. జగనన్న ఇళ్ల పేరిట కొండలు, గుట్టలు ఉన్న ప్రాంతాల్లోనే అత్యధికంగా స్థలాలు పంపిణీ చేశారు. శ్రీకాకుళం నగర ప్రజలకు రాగోలు, పొన్నాడ, పాత్రునివలస ప్రాంతాల వద్ద స్థలాలు కేటాయించారు. పొన్నాడ, పాత్రునివలస-1 లేఅవుట్‌లో స్థలాలను లబ్ధిదారులు ఇప్పుడు విక్రయిద్దామన్నా సరే రూ.50 వేలకు కూడా కొనుగోలు చేసుకునేందుకు స్థలం పక్కనున్నవారు సైతం ముందుకురాని పరిస్థితి. ఇందుకు కారణం.. కొండలు, రాళ్లు, గుట్టలున్న ప్రాంతం కావ డమే. పైగా నగరానికి చాలా దూరంగా ఉండడంతో ఇక్కడ ఇళ్ల నిర్మాణానికి శ్రద్ధ చూపడం లేదు. అయితే పట్టణ ప్రజ లకు ఇచ్చిన సెంటు స్థలం రూ. 6 లక్షలు అని కరపత్రంలో ముద్రించారు. అలాగే పలువురు ఇంటి నిర్మాణం చేపట్టకపో యినా.. వారికి రూ. 2.5 లక్షలు మంజూరై పోయిందంటూ కరపత్రంలో లెక్కలు చూపారు. దీనిపై లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. నిర్మాణానికి ఆమోదయోగ్యంగా లేని కొండలు, గుట్టలపై కేటాయించిన స్థలం విలువ రూ.6 లక్షలు పేర్కొన డం అన్యాయమని పేర్కొంటున్నారు. ప్రభుత్వం రూ.లక్ష నుంచి రూ.2లక్షలు ఇస్తే ఆ స్థలాన్ని ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారు. అలాగే కరోనా వ్యాప్తి సమయంలో కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యాన్ని పంపిణీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కుటుంబానికి రూ.వెయ్యి చొప్పున సాయం చేసింది. కాగా.. కరోనా కారణంగా నిత్యావసరాల ధరలు భారీగా పెరగ్గా.. ఇచ్చిన రూ.వెయ్యి సాయం ఏమాత్రమని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. అది కూడా కరపత్రాల్లో ముద్రించడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

● హామీల అమలులో ఆ వివరాలు ఏవీ?

2024 ఎన్నికల సమయానికి మద్యాన్ని నిషేధిస్తామని జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో హామీఇచ్చారు. సీపీఎస్‌ను వారం రోజుల్లో రద్దుచేస్తామని ఉద్యోగ సంఘాలకు భరోసా ఇచ్చారు. ప్రత్యేకహోదా రాష్ట్రానికి వస్తే.. పరిశ్రమలు వస్తాయని.. మరింత అభివృద్ధి సాధిస్తామని ప్రకటించారు. ఈ హామీలేవీ అమలు కాలేవు. కరపత్రాల్లో కూడా వీటి ఊసు లేదు. అటువంటి 99 శాతం హామీలు అమలు చేశామని వైసీపీ గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని లబ్ధిదారులు విమర్శిస్తున్నారు.

లైసెన్స్ తుపాకీల స్వాధీనం

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో లైసెన్స్ ఉన్న తుపాకులను వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లలో డిపాజిట్ చేయించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ వెల్లడించారు. కలెక్టర్, ఎస్పీ సోమవారం సమావేశమై... లైసెన్స్ కలిగిన ఆయుధాల జాబితాపై సమీక్షించారు. బ్యాంక్‌లలో పనిచేసే సెక్యూరిటీ గార్డులు, ఏటీఎం కేంద్రాలకు డబ్బులు తీసుకువెళ్లే సెక్యూరిటీ ఏజెన్సీలు, క్రీడా ఈవెంట్‌ల నిమిత్తం మినహా ఇతర వ్యక్తులు తమ ఆయుధాలు డిపాజిట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 273 లైసెన్సు తుపాకులు ఉన్నాయని.. వాటిలో బ్యాంకు సెక్యూరిటీ గార్డుల వద్ద 47, క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ వద్ద 28 తుపాకులకు మినహాయింపు ఇచ్చామని తెలిపారు. మిగిలిన ప్రైవేటు వ్యక్తుల వద్ద ఉన్న తుపాకీలను స్థానిక పోలీస్‌స్టేషన్ల ద్వారా నిబంధనల ప్రకారం ఎస్పీకి డిపాజిట్ చేశారని కలెక్టర్ స్పష్టం చేశారు.

కంట్రోల్ రూమ్ పరిశీలన

ఎన్నికలకు సంబంధించి కొత్త కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ సోమవారం పరిశీలించారు. కంట్రోల్ రూమ్‌లో ఎంసీఎంసీ, సోషల్ మీడియా, డిస్ట్రిక్ట్ కాంటాక్ట్ సెంటర్ 1950, కంప్లైంట్ మోనటరింగ్ సెల్, పోలీస్ కంట్రోల్ రూమ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, సీ-విజిల్‌లను ప్రస్తుతం ఏర్పాటు చేశారు. ప్రతి విభాగంలోనూ సిబ్బంది పనితీరుపై కలెక్టర్ ఆరా తీశారు. ఇప్పటివరకు అందిన ఫిర్యాదుపై చర్చించారు. ఫ్లైయింగ్‌స్క్వాడ్ టీమ్‌లు, జీపీఎస్ వాహనాల హాజరైన సమయాలను, వెళ్లిన రూట్లను తదితర వాటిని పరిశీలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి గణపతిరావు, ఆయా విభాగాల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పోలీసు స్పందన కార్యక్రమం రద్దు

శ్రీకాకుళం క్రైం, మార్చి 18: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నామని ఎస్పీ జీఆర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంతవరకూ స్పందన నిర్వహించబడదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు.

కందిరీగల దాడిలో 35 మందికి గాయాలు

హరిపురం, మార్చి 18: మందస రోడ్డు(హరిపురం) రైల్వేస్టేషన్‌లో సోమవారం కందిరీగలు దాడి చేయడంతో సుమారు 35 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. విశాఖపట్నం వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌లో ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ కోసం ప్రయాణికులు వేచి ఉన్నారు. ప్లాట్‌ఫారంపై ఉన్న చెట్ల నుంచి కందిరీగల గుంపు ఒక్కసారి దాడి చేయడంతో ప్రయాణికులు భయాందోళనతో పరుగులు తీశారు. కొందరు స్టేషన్ గదుల్లోకి వెళ్లి తలుపులు మూసి కందిరీగల నుంచి రక్షించుకున్నారు. ఈ దాడిలో సుమారు 35మంది గాయపడగా వీరందరినీ హరిపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఈ హడావుడిలో ఇంటర్‌సిటీ రైలు వచ్చి వెళ్లిపోవడంతో కొందరు ప్రయాణాలు రద్దు చేసుకున్నారు. మరికొందరు బస్సులను ఆశ్రయించారు. కందిరీగల దాడిలో ఎవరికీ ప్రాణాపాయ స్థితిలేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఎమ్మెల్యే మనుషులమని చెప్పి..

- బెల్టు దుకాణాల నిర్వహణ
- ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు సిబ్బంది ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైం, మార్చి 18: 'ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలకు సమీపంలో ఎమ్మెల్యే వర్గీయుల స్థలాల్లో టెంట్లు వేసి.. బెల్టు దుకాణాల తరహాలో మద్యం కార్యకలాపాలు సాగిస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే మనుషులమని.. నచ్చింది చేసుకోమని సవాల్ చేస్తున్నారు' అంటూ ఎక్సైజ్ సిబ్బంది ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) బి.సుబ్బారావుకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఎచ్చెర్లలోని బాట్లింగ్ కేంద్రంలో ఎన్నికల నిబంధనలపై సిబ్బందికి ఈఎస్ అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలో ఓ ఎమ్మెల్యే మేనల్లుడు తీరుపై ఎక్సైజ్ సిబ్బంది ముక్తకంఠంతో మొర పెట్టుకు న్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఉద్యోగం తలనొప్పిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రణస్థలం, పైడిభీమవరం ప్రాంతాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలకు సమీపంలో ఉన్న ఎమ్మెల్యే మేనల్లుడు సొంత స్థలాల్లో టెంట్లు వేయించి అందరికీ మద్యం అందిస్తున్నారని తెలిపారు. అక్కడ షాపులు ఏర్పాటు చేసి మద్యం సేవించేలా వాతావరణాన్ని కల్పించారన్నారు. అడిగితే ఎమ్మెల్యే మనుషులమని చెబుతున్నారని.. దీనికి ఎమ్మెల్యే మేనల్లుడు ప్రధాన కారకుడని తెలిపారు. పోలీసులకు తెలిసినా పరిస్థితి మారలేదన్నారు. దీనిపై ఈఎస్ సుబ్బారావు స్పందిస్తూ.. ఈ విషయాన్ని ఎస్పీ రాధిక దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పని చేయాలని, ఇటువంటి ఘటనలు ఎదురైనప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్బారావు



మెళియాపుట్టిలో ప్రచారంలో పాల్గొన్న వలంటీర్

నిబంధనల ఉల్లంఘన

- ఇంటింటా వలంటీర్ల ప్రచారం

మెళియాపుట్టి, మార్చి18: కొంతమంది వలంటీర్లు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ప్రచారంలో వలంటీర్లు పాల్గొంటే చర్యలు తప్పవని ఎన్నికల కమిషనర్ ఆదేశాలీ జారీచేసినా.. పట్టించుకోవడం లేదు. సోమవారం సాయంత్రం మెళియాపుట్టిలో వైసీపీ అభ్యర్థి రెడ్డి శాంతి తరఫున ఆమె కుమారుడు శ్రావణ్‌కుమార్ ప్రచారం నిర్వహించగా.. ఒక వలంటీరు పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఎమ్మెల్యే రెడ్డి శాంతి మరో కుమారుడు ఓంశ్రీకృష్ణ నిర్వహించిన ప్రచారంలో కూడా పలువురు వలంటీర్లు పాల్గొన్న విషయం తెలిసిందే. దీనిపై పలువురు ఫిర్యాదు చేయగా.. విచారణ చేసి నివేదిక అందజేయాలని తహసీల్దార్ జానకమ్మకు కలెక్టర్ ఆదేశించారు. కానీ ఇంతవరకూ ఆ వలంటీర్లపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా సోమవారం కూడా ఎన్నికల ప్రచారంలో వలంటీరు పాల్గొనడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే రెడ్డి శాంతి తాయిలాలు ఇవ్వడంతో వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



కోడ్ కూసినా.. తొలగించరా?

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా.. నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో రాజకీయనాయకుల చిత్రాలు తొలగించకపోవడంపై విమ ర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆస్పత్రిలోని ఆక్సిజన్ ప్లాంట్, కొత్త భవన ప్రారంభ శిలాఫలకంపై సీఎం జగన్, ఎమ్మెల్యే కృష్ణదాస్ ఫొటోలు దర్శనమిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ సహాయ కేంద్రం వద్ద కూడా నేతల చిత్రాలున్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాలను ఆస్పత్రి సిబ్బంది ఉల్లంఘిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. - నరసన్నపేట



శ్రీకాకుళం : పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు



ప్రశాంతంగా 'పది' పరీక్షలు

- పటిష్ఠ బందోబస్తు నడుమ నిర్వహణ
- కలెక్టర్, ఎస్పీ కేంద్రాల పరిశీలన
- తొలిరోజు 458 మంది గైర్హాజరు

గుజరాతీపేట/ కలెక్టరేట్/ శ్రీకాకుళం క్రైం, మార్చి 18: జిల్లాలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సోమవారం జిల్లావ్యాప్తంగా 145 కేంద్రాల్లో పటిష్ఠ బందోబస్తు నడుమ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 29,243 మంది విద్యార్థులకుగానూ తొలిరోజు 28,785 మంది హాజరయ్యారు. 458 మంది గైర్హాజరయ్యారని డీఈవో వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి కన్నా గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పరీక్షా కేంద్రాల బయట సందడి నెలకొంది. శ్రీకాకుళం నగరం అరసవల్లి రోడ్డులోని కేశవరెడ్డి పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ పరిశీలించారు. ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు, సౌకర్యాలపై ఆరా తీశారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని స్పష్టం చేశారు. అలాగే భాష్యం, గీతాంజలి పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలను ఎస్పీ జీఆర్ రాధిక పరిశీలించారు. విద్యార్థులకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఏఎస్పీ ప్రేమ్‌కాజల్ కూడా పలు కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ టి.నారాయణమూర్తి, దయానంద కుమార్ పాల్గొన్నారు.



నరసన్నపేట : తల్లిదండ్రుల సహాయంతో పరీక్షకు వెళ్తున్న దివ్యాంగులు







జి.సిగడాం : పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు



పలాస : ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద

బైక్‌పై గంజాయి రవాణా

- పోలీసులకు చిక్కిన ఒడిశా వాసి

పలాస, మార్చి 18: పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో ఒడిశా చెందిన కరుణకరడ అనే వ్యక్తి 20కిలోల గంజాయిని బైక్‌పై తరలిస్తూ కాశీబుగ్గ పోలీసులకు పట్టుబడ్డాడు. ఎస్ఐ ఎం.వెంకటరావు కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రం ఆర్.ఉదయగిరి బ్లాక్ రాజ్‌పూర్ గ్రామానికి చెందిన కరుణకరడ చెన్నైలో ఇటుక పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఆయన ఒడిశాలోని స్వగ్రామానికి వచ్చి 20కిలోల గంజాయిని మూటగా కట్టి ద్విచక్రవాహనంపై పలాస రైల్వేస్టేషన్ రోడ్డుకు చేరుకున్నాడు. అక్కడ వాహనాన్ని పార్కింగ్ చేసి.. గంజాయిని రైలులో తరలించేందుకు పథకం వేశాడు. మఫ్టీలో ఉన్న కాశీబుగ్గ పోలీసులు ఆయనపై అనుమానంతో ప్యాకెట్‌ను తనిఖీ చేయగా గంజాయి బయట పడింది. వెంటనే ఆయన్ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కరుణకరడను కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఎస్ఐ వెంకటరావు తెలిపారు. దాడుల్లో హెచ్‌సీ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు ఈశ్వరరావు, నీలకంఠం, సిబ్బంది పాల్గొన్నారు.



గంజాయితో పోలీసులకు పట్టుబడిన కరుణకరడ

కాంగ్రెస్‌లో చేరిన తులసీదాస్ కుమారుడు

● త్రినాథ్‌బాబుకు పార్టీ కండువా కప్పిన పరమేశ్వరరావు

టెక్కలి, మార్చి 18: పీసీసీ మాజీ అధ్యక్షుడు, దివంగత నేత మజ్జి తులసీ దాస్ కుమారుడు మజ్జి త్రినాథ్‌బాబు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ పిలుపు మేరకు 'మన ఇంటికి రండి' కార్యక్రమంలో భాగంగా టెక్కలి పార్టీ కార్యాలయంలో ఆయనకు డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. మూడు రోజుల కిందట పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ను విశాఖలో కలిసి పార్టీలో చేరేందుకు సుముఖత వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పరమేశ్వ రరావు మాట్లాడుతూ.. తులసీదాస్ కుటుంబ మంతా కాంగ్రెస్‌తో కలిసి పనిచేశారని, మరో సారి ప్రజాసేవకు త్రినాథ్‌బాబు కాంగ్రెస్‌లో చేరడం ఆనందంగా ఉందన్నారు.


మజ్జి త్రినాథ్‌బాబుకు పార్టీ కండువా కప్పి స్వాగతిస్తున్న పరమేశ్వరరావు

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

కాశీబుగ్గ: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు, తండ్రి దివంగత పీసీసీ అధ్యక్షుడు తులసీదాస్ ఆశయ సాధనకు, కాంగ్రెస్ బలోపేతానికి పాటుపడతానని మజ్జి త్రినాథ్‌బాబు అన్నారు. సోమవారం ఆయన కాశీబుగ్గలో విలేకరులతో మాట్లాడుతూ.. తండ్రి తులసీదాస్ ప్రజాసేవలో పేరుపొందా రని, మా కుటుంబమంతా కాంగ్రెస్ పురోభివృద్ధికి కృషి చేసిందన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఏ బాధ్యతలను అప్పగించినా చిత్తశుద్ధితో నిర్వర్తిస్తాన న్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, కొర్ల హేమారావు చౌదరి, డాక్టర్ రమేష్ సాహు, రాజారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

జలుమూరు: ఎన్నిక ల కోడ్ ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తప్పవని ఎన్నికల కోడ్ ఫ్లైయింగ్ స్క్వాడ్ తిరుపతిరావు హెచ్చరించారు. 'కోడ్ పట్టదా' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో సోమవారం వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. జలుమూరు, చల్లవానిపేట, శ్రీముఖలింగం, తదితర గ్రామ సచివాలయాలు, కూడళ్లను పరిశీలించారు. తక్షణం రాజకీయ పార్టీల బ్యానర్లు తొలగించాలని, శిలాఫలకాలను మూసి వేయాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ సచివాలయాల్లో బయట, లోపల ఉన్న రాజకీయ పార్టీల నేతలు ఫొటోలు, బ్యానర్లు తొలగించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


చల్లవానిపేట సచివాలయాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల కోడ్ ఫ్లైయింగ్ స్క్వాడ్

తాగునీరందించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెళియాపుట్టి: ఎగువ చింతల పొలూరులో తాగునీరు సమస్య తాత్కాలికంగా పరిష్కారమైంది. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'తాగునీటికి కటకట' శీర్షికతో కథనం రావడంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కల్యాణ్ స్పందించారు. గ్రామాన్ని సందర్శించి తాత్కాలికంగా ట్యాంకర్ ద్వారా నీరందించారు. త్వరలో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరందిస్తామని ఆయన పేర్కొన్నారు.


ఎగువ చింతపొలూరులో తాగునీరు అందిస్తున్న దృశ్యం

ఎన్నికల నియమావళి ఉల్లంఘించారంటూ ఫిర్యాదు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ చినబాడం గ్రామానికి చెందిన పోస్టు ఉమెన్ పి. రాజేశ్వరి కొందరు వైసీపీ నాయకులతో కలిసి నర్సిపురంలో కొత్త ఓటర్ ఐడీ కార్డులను పంపిణీ చేసి కోడ్ ఉల్లంఘించారని, దీనిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు సోమవారం ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. అనంతరం గ్రామంలో టీడీపీ నాయకులు బడ్డ నాగరాజు, సప్ప నవీన్, జోగ మల్లి, రవి విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఓటరు ఐడీలను చినబాడం, నర్సిపురం గ్రామాల్లో పంపిణీ చేస్తుండడంతో తాము ఆమెను ప్రశ్నించగా అడ్రస్ తెలియకపోవడంతో వారి సహాయం కోరానని తెలిపారన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా వైసీపీ నాయకుల సాయం కోరడం ఏమిటని, దీనిపై ఫోన్ ద్వారా మాట్లాడిన సంభాషణలను పెన్‌డ్రైవ్ ద్వారా ఆర్డీవోకు అందజేసినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ప్రజాగళం విజయవంతం

మబగాం(పోలాకి): టీడీపీ-బీజేపీ-జనసేన పార్టీలు ఉమ్మడిగా చిలకలూరిపేటలో ఆదివారం నిర్వహించిన ప్రజాగళం సభ విజయవంతమైందని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. సోమవారం మబగాంలో విలేకరులతో మాట్లాడుతూ.. జగన్ సైకో పాలనకు చమరగీతం పాడేలా సమావేశం సాగిందన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని చిలకలూరిపేట ప్రజాగళం సభ రుజువు చేసిందన్నారు. కార్యక్రమంలో నేతలు కింజరాపు రామారావు, అడపా చంద్రశేఖర్, వాన రవీంద్ర, రావాడ కృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జాతీయ లోక్‌అదాలత్‌లో 155 కేసుల పరిష్కారం

టెక్కలి: టెక్కలి కోర్టు సముదాయం పరిధిలో సోమవారం రెండు బెంచ్‌ల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 155 కేసులు పరిష్కారమైనట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు తెలిపారు. ఒక బెంచ్‌లో సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు, రెండో బెంచ్‌లో జూనియర్ సివిల్ న్యాయాధికారి బీ ఎంఆర్ ప్రసన్నలత లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు సివిల్ కేసులు, 15 క్రిమినల్, 20 ఎక్సైజ్, 111 రాజీ అయిన కేసులు, చెక్ బౌన్స్, మనోవర్తి కేసులు ఒక్కొక్కటి, రెండు బ్యాంకు పీఎల్‌సీ కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, లోక్‌అదాలత్ సభ్యులు ధవళ రాజేశ్వరరావు, ఎ.వైకుంఠరావు, బి.శ్రీనివాసరావు, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారి

ఎన్ఎస్ఎస్‌తో వ్యక్తిత్వ వికాసం

నరసన్నపేట: యువతలో వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చెందేందుకు ఎన్ఎస్ఎస్ దోహదం చేస్తుందని రిటైర్డ్ ఆర్ఐవో ఎస్. రుక్మాంగధరరావు, ఎంఈవో పేడాడ దాలి నాయుడు అన్నారు. సోమవారం జమ్ము, సత్యవరం గ్రామాల్లో జ్ఞానజ్యోతి, ఎల్వీఆర్ డిగ్రీ కళాశాలల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాలను వేర్వేరుగా నిర్వహించారు. విద్యార్థి దశ నుంచి సామాజిక సేవను పెంపొందించుకోవాలన్నారు. గ్రామాల్లో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా కళశాలలు ప్రిన్సిపాళ్లు చింతు కృష్ణారావు, ఎం.ప్రసాదరావు, ఎన్ఎస్ఎస్ పీవోలు అప్పారావు, పి.మోహనరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈవో దాలినాయుడు

ధర్మనీలాపురంలో...

టెక్కలి: తొలుసూరుపల్లి పంచాయతీ ధర్మనీలాపురంలో సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా శిబిరం ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ వారం రోజుల పాటు గ్రామంలో వివిధ సేవా కార్యక్ర మాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో వాసుబాబు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

కోదండరాముని విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

పల్లిపేట(పోలాకి): వంశధార నదీ తీరాన పల్లిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పరిషత్ విజ్ఞాపనం, రక్షాసూత్ర ధారణ, మండలారాధన, అగ్ని మథనం తదితర కార్యక్రమాలు చేపటారు. చామర్తి సత్యశ్రీధరాచార్యులు, చామర్తి శ్రీనివాసాచార్యులు, మావుదూరి గురునాథ శర్మ పర్యవేక్షణలో 16 మంది రుత్వికులు ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాలకు సంక్షేమం

టీడీపీ ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు సంక్షేమం సాధ్యమని, రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు ప్రతిఒక్కరూ సహకరించాలని టీడీపీ నాయకులు కోరారు. సోమవారం జిల్లాలో పలు ప్రాంతాల్లో సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సోంపేట: మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్


ఇచ్ఛాపురం: పథకాలపై అవగాహన కల్పిస్తున్న నేతలు

వికృత చేష్టలతో రాష్ట్రాన్ని జగన్ భ్రష్టుపట్టించారు

సోంపేట, మార్చి 18: టీడీపీ పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. సోమవారం పట్టణంలోని బీఎస్ కాలనీ, నేతాజీ నగర్, గాంధీనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలిపిస్తే ఉచిత పథకాలు అందుతాయన్నారు. వికృతచేష్టలతో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన జగన్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు, దూసి మధుసూదన్, బీన ఆనంద్, చిత్రాడ శేఖర్, మడ్డు రవి తదితరులు ఉన్నారు.

● ఇచ్ఛాపురం: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలతో ఇంటిళ్లపాదికి ఆర్థిక లబ్ధి చేకూరుతుందని మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు అన్నారు. సోమవారం నీలాపుపుట్టుగ గ్రామం లో సూపర్-6పై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డి.శ్రీను, డి.కామేశ్వరరావు, జోగారావు, కె.నరేంద్ర, హరికృష్ణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

● కంచిలి: అంపురం, పద్మతుల, పెద్ద అంపురం, జక్కర గ్రామాల్లో టీడీపీ నాయకులు సోమవారం సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధి పనుల్లో ఉన్న కూలీల వద్దకు వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలపై వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదిన రామారావు, మన్మధరావు, హరిబాబు, శ్రీకాంత్, పాపాయ్య, గోపాల్, చంద్రయ్య, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు

● కవిటి: టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు. సోమవారం జగతి గ్రామంలో ఎమ్మెల్యే సతీమణి బి.నీలోత్పల ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ ద్వారా టీడీపీ అమలు చేయనున్న పథకాలపై వివరించారు. చంద్రబాబు హయాంలోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మణిచంద్ర ప్రకాష్, నాయకులు బి.రమేష్, బి.నారాయణమూర్తి, బి.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

● పొందూరు: మండల కేంద్రమైన పొందూరులో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● నందిగాం: మండలంలోని కొండల ప్రాంతం అన్నాపురంలో సోమవారం టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పి.అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి రానున్న టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వంలో అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ కూటమి విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు ఎం.బాలకృష్ణ, ఎస్.నాగరాజు, బి.గిరిబాబు, తిరుపతిరావు, నాగేశ్వరరావు, ఎం.మోహనరావు, మురళీ, ఎస్.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.




కంచిలి, పొందూరు, నందిగాం మండలాల్లో సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కలిగిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు


కవిటి: జగతిలో అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే సతీమణి నీలోత్పల

స్నేహబంధం ఏర్పరచుకోవాలి

హిరమండలం: జీవితంలో విజయ సాధనకు భగవంతునితో స్నేహబంధాలను ఏర్పరచుకోవాలని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం మౌంట్ అబూ మోటివేషనల్ స్పీకర్, సీనియర్ రాజయోగి బీకే రూపేష్ భాయిజీ అన్నారు. హిరమండలం శాఖ నవ నిర్మిత విశ్వ కల్యాణ భవన్‌ను సోమవారం ప్రారంభించారు. శివ పార్వతులతో స్నేహం పెంచుకోవడం వల్ల ప్రతి విషయంలో విజయం సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

పనులను శరవేగంగా పూర్తి చేయాలి

నరసన్నపేట: ఎన్నికల కోడ్ ప్రకటించకముందు ప్రారంభించిన పనులను శరవేగంగా పూర్తి చేయించాలని పంచాయతీరాజ్‌శాఖ చీఫ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నాలుగు మండలాల ఇంజనీరింగ్ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పాడైన రోడ్లు, బిల్డింగ్‌లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బీటీ రోడ్లను పూర్తి చేయాల న్నారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ వీఎస్ఎన్ మూర్తి, ఈఈ ఆర్.గిరిధర్, డీఈఈ సత్యంనాయుడు, మండల ఇంజనీరింగ్ అధికారులు వై.మోహన్, కీర్తన, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చూడండి

వజ్రపుకొత్తూరు: వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఎంపీడీవో తిరుమలరావుతో నీటి ఎద్దడి నివారణపై తీసుకోవాల్సిన చర్యల పై సమీక్షించారు. వేసవి తీవ్రత పెరుగుతున్నందున నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

వజ్రపుకొత్తూరు: పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ అక్కుపల్లి క్లస్టర్ సూపర్‌వైజర్ యు.లత అన్నారు. కొండపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న మెనూపై వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. 'పోషణ్ పక్వాడా'లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నమర్రిపాడులో జామి జాతర

సంతబొమ్మాళి: చిన్న మర్రిపాడులో జామి జాతర సోమవారం నిర్వహించారు. సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం, వజ్రపుకొత్తూరు మండలాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి ఎల్లమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి

● పోలీస్ కవాతులో పాల్గొన్న కలెక్టర్
● చెక్ పోస్టుల తనిఖీ

టెక్కలి, మార్చి 18: సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి తప్పిదాలు దొర్లకుండా పకడ్బందీగా నిర్వహిం చాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. సోమ వారం ఆయన టెక్కలి, కొత్తపేట ప్రాంతాల్లో చెక్ పోస్టు లను ఆకస్మికంగా సందర్శించారు. వాహనాల తనిఖీని పరిశీలించారు. టెక్కలిలో నిర్వహించిన పోలీసు కవాతులో పాల్గొన్నారు. డిగ్రీ కళాశాల వద్ద ఎన్నికల అధికారులతో మోడల్ కోడ్ అమలు, పర్యవేక్షణపై సమీక్షించారు. ఎన్నికల్లో ఎటువంటి తప్పిదాలు జరగకుండా చూడాలని ఆర్వో, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు సూచించారు. ఎన్నికల విధులకు వచ్చిన పోలీసు అధికారులతో మాట్లాడి పలు సూచ నలు అందించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఏఆర్వో మురళీకృష్ణ, డీఎస్పీ బాల చంద్రారెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


టెక్కలిలో ఎన్నికల విధులకు వచ్చిన పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

పక్కాగా ఎన్నికల నియమావళిని అమలు

నందిగాం: ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని టెక్కలి సబ్‌కలెక్టర్, రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ ఆదేశించారు. సోమవారం మండల పరిధిలో నియమావళి అమలు తీరుపై స్థానిక అధి కారులతో కలిసి పరిశీలించారు. నందిగాం, పెంటూరు, నరేంద్రపురం, కణితి వూరు, ప్రతాప విశ్వనాథపురం, హరిదాసుపురం, సుభద్రాపురం గ్రామాల్లో పర్యటించి సూచనలు చేశారు. ఏ గ్రామంలోను హోర్డింగ్‌లు, ప్లెక్సీలు, కటౌట్లు ఉండడానికి వీలులేదని, వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారి జి.శివప్రసాద్‌కు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.పద్మావతి, ఆర్ఐ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డీటీగా ప్రవీణ్ కుమార్

హిరమండలం: డీటీగా ప్రవీణ్ కుమార్ వచ్చారు. ఈయన పాత పట్నం నుంచి డెప్యుటేషన్‌పై వచ్చారు. ఇక్కడి డీటీ వెంకటరమణ పాత పట్నం బదిలీ అయ్యారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, టెక్కలి బ్రాంచ్, టెక్కలి వారి భోగట్టాపై ఇస్తున్న పబ్లిక్ నోటీసు. శ్రీకాకుళం జిల్లా, టెక్కలి మండలం, రఘునాథపురం గ్రామం కాపురస్థులైన శ్రీ కవిటి రాజు S/o వాసుదేవరావు వీరి ప్రోపర్టీని షూరిటీగా తీసుకొని వీరి ఫర్మ్ అయిన శ్రీవెంకటేశ్వర స్వామి స్టోన్ క్రషర్ యాజమాన్యానికి ఋణమునకు హామీగా అతని స్వాధీన, హక్కు అనుభవము లోనున్న ఈ దిగువ షెడ్యూలులో వివరించిన ఆస్తిని తాకట్టుగా పెట్టుటకు ప్రతిపాదించియున్నారు. కావున సదరాస్తిపై వేరెవ్వరికైనా ఎట్టి హక్కుగాని, ఆసక్తిగాని ఉన్న యెడల అట్టివారు ఈ నోటీసు ప్రచురింపబడిన ఏడు దినములలోగా వారి యొక్క అక్షేపణలను నాకుగాని, నా క్లయింటుకుగాని తెలియపరచవలెను. లేని యెడల సదరాస్తి పైగాని, దానిపై జరపబోవు తాకట్టుపైగాని ఎవరికీ ఎట్టి అభ్యంతరములు లేవని భావింపబడునని యిందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది. షెడ్యూలు: శ్రీకాకుళం జిల్లా, టెక్కలి స.రి.వారి యిలాకా, టెక్కలి మండలం, టెక్కలి పంచాయితీ, రఘునాథపురం గ్రామంలో యున్న 11వ వార్డులో గల ఆది ఆంధ్ర వీధికి పోయే రోడ్డునకు దిశలోయున్న సర్వే నెం. 416/3బి పూరా య.6-23ట్లులో దక్షిణ దిశలో మధ్యను శ 0-10ట్లు అనగా తూర్పులకు 42అ॥లు (12.796మీ॥), ఉత్తరములకు 90అ॥లు (27.420మీ॥) అనగా మొత్తం 420చ॥గ॥ కల్గియున్న జి.స్థలానికి హద్దులు: తూ: మా తాలూకా జి.స్థలం, ప: గేదెల అప్పలసూరమ్మ జి.స్థలం, ద: 10అ॥ వెడల్పు గల రోడ్డు, ఉ: డ్రైనేజ్.

D.V.Viveikananda, Advocate, Tekkali, Cell : 9440436751

టెన్త్ పరీక్షలు ప్రారంభం

పదో తరగతి పరీక్షలు జిల్లావ్యాప్తంగా సోమవారం ప్రారంభమయ్యాయి. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో కలిసి విద్యార్థులంతా ఉదయం 9:30 గంటలకు ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను పోలీసులు అమలు చేశారు. ఆయా కేంద్రాలను పోలీసులు, అధికారులు పరిశీలించారు. కాగా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు.

- ఆంధ్రజ్యోతి బృందం


సోంపేట: రూమ్ నెంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


కలెక్టరేట్: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్


హిరమండలం: ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులు

బస్సులు లేక ఆటోలో ఇలా..


శ్రీకాకుళం క్రైం: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక


శ్రీకాకుళం క్రైం: సిబ్బందికి సూచనలిస్తున్న ఏఎస్పీ ప్రేమ్ కాజల్


కంచిలి: పరీక్షలు రాస్తున్న విద్యార్థులు


టెక్కలి: రూమ్ నెంబర్లు చెక్ చేసుకుంటున్న విద్యార్థినులు


పొందూరు: పరీక్షలు రాస్తున్న విద్యార్థులు


గార: జడ్పీ హైస్కూల్ వద్ద వేచి ఉన్న విద్యార్థులు


పలాస: ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష హాలులోకి వెళ్లేందుకు వేచి ఉన్న విద్యార్థులు


సరుబుజ్జిలి: కొత్తకోట పరీక్ష కేంద్రం వద్ద..


నందిగాం: బాలికల గురుకుల కేంద్రం వద్ద..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


లోకనాథం(ఫైల్)

సంతబొమ్మాళి: పెద్దమర్రిపాడు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడకు చెందిన తేరిపల్లి లోకనాథం(33) మృతి చెందాడు. నౌపడ పోలీసులు, కుటుంబ సభ్యులు అందించిన వివరాలిలా ఉన్నాయి.. చినమర్రిపాడులో జరుగుతున్న ఎల్లమ్మ జాతరకు లోకనాథం బైక్‌పై వెళ్లాడు. తిరిగి వస్తుండగా అదే గ్రామానికి చెందిన ఆటో పెద్దమర్రిపాడు చెరువు వద్ద ఉన్న రోడ్డు మలుపులో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. సమాచారం అందుకున్న నౌపడ పోలీసులు హుటాహుటిన అక్కడికి వచ్చి తీవ్రంగా గాయపడిన లోకనాథాన్ని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కాగా లోకనాథం దేవునల్తాడ సర్పంచ్ తేరిపల్లి వరదరాజు సోదరుడు. దీంతో దేవునల్తాడలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నౌపడ ఎస్ఐ కిశోర్ వర్మ తెలిపారు.

లారీ ఢీకొని విద్యార్థి..


కల్యాణ్(ఫైల్)

కొత్తూరు: మాసింగి గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటర్ చదువుతున్న పాలక కల్యాణ్(16) మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కల్యాణ్ భామినిలోని స్నేహితులైన మణికంఠ, వంశీలతో కలిసి ద్విచక్ర వాహనంపై సీతంపేట వైపు నుంచి కొత్తూరు వస్తుండగా.. ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో కల్యాణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్నేహితులిద్దరూ తీవ్రంగా గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం కొత్తూరు సామాజిక ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాగోలు జెమ్స్‌కి తరలించారు. కల్యాణ్ తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ నుంచి జారిపడి మహిళకు గాయాలు

సంతబొమ్మాళి: మండలంలోని యామలపేట స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ మీద నుంచి జారిపడి తిప్పాన హైమావతికి గాయాలయ్యాయి. బడే నరసాపురానికి చెందిన తిప్పాన మల్లేసు, హైమావతి నౌపడ వైపు బైక్‌పై వెళ్తుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద బండి అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కొట్లాటలో ఇరువర్గాలపై కేసు నమోదు

జలుమూరు: బావాజీపేటలో ఆదివారం రాత్రి జరిగిన కొట్లాటకు సంబంధించి ఇరువర్గాలవారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బావాజీపేటకు చెందిన కొత్తకోట వెంకటరమణ మర్రికర్ర చెరువులో నీటి ఇంజన్ పెట్టి పైపు వేశాడు. ఈ పైపు గుండా వచ్చే నీరు అదే గ్రామానికి చెందిన గొర్లె చిన్నమ్మడు ఇంటి వద్ద లీకై అక్కడ తీసిన లెట్రిన్ గొయ్యి నిండిపోయి ఇంటిలోకి రావడంతో నీటిని నిలుపుదల చేయాలని అడిగారు. దీంతో కొత్తకోట వెంకటరమణతో పాటు అతడి తండ్రి ఆదినారాయణ కులంపేరుతో దూషించి గాయపడిచారని చిన్నమ్మడు ఫిర్యాదు చేయడంతో వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అలాగే పొలానికి సాగునీరందించేందుకు మర్రికర్ర చెరువు నీటిని ఇంజన్ ద్వారా తోడుతుంటే పైపు లీకై ఇంటిముందు గుంతలోకి నీరు వచ్చేస్తోందని గొర్లె తిరుపతిరావు, నారాయణరావు, చల్ల సాయి దౌర్జన్యంగా దాడి చేసి గాయపరిచారని కొత్తకోట వెంకట రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

మట్టి ట్రాక్టర్ అడ్డగింత


మట్టితో వెళుతున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్న గ్రామస్థులు

వజ్రపుకొత్తూరు: బెండి గ్రామం మీదుగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం గ్రామస్థులు అడ్డగించారు. రైతుల పొలాల నుంచి మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారని, అసంపూర్తిగా ఉన్న రోడ్డుపై ట్రాక్టర్లు తిరుగుతుండడంతో దుమ్ము, ధూళి ఎగిరి ఇళ్లలోకి వస్తోందని, దీంతో శ్వాసకోశ సంబంధిత వ్యాధులు ప్రబలి ఇబ్బందులకు గురవుతున్నా మన్నారు. యాజమాన్యం తగు జాగ్రత్తలు తీసుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అరసవల్లి: రానున్న ఎన్నికలు నేపథ్యంలో కోడ్ అమలులోకి వచ్చిందని, అందువల్ల పార్టీ శ్రేణులంతా అప్రమత్తంగా ఉండాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలంలో ఉన్న పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు 24 గంటల్లోగా తొలగించాల్సి ఉంటుందని, అలాగే పబ్లిక్ ప్రదేశాల్లో అతికించిన నేతల ఫొటోలు, ప్రచారాలకు సంబంధించిన వాటిని 48 గంటల్లోగా తొలగించాలన్నారు. ప్రభుత్వ భవనాలు, ప్రాంగణాలు, మతపరమైన స్థలాల్లో ఎన్నికలకు సంబంధించిన సమావేశాలు గానీ, ప్రచారాలు కానీ నిర్వహించరాదని, ప్రభుత్వ ఉద్యోగులు ప్రచార కార్యక్రమంలో పాల్గొనడం నిషేధమన్నారు. వీటి పర్యవేక్షణకు జిల్లా టీడీపీ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసిందన్నారు. పార్టీ శ్రేణులంతా అప్రమత్తంగా ఉండి ఎక్కడైనా ఉల్లంఘనలు జరిగితే ఫొటోతో సహా సి-విజిల్ యాప్ ద్వారా ఎన్నికల యంత్రాంగానికి, జిల్లా పార్టీ కార్యాలయానికి తెలియజేయాలని కోరారు. సమావేశంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు బొనిగి భాస్కరరావు, బీసీ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు కొమ్మనాపల్లి వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ

అరసవల్లి: ఏపీఎస్‌ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ (శ్రీకాకుళం)లో 15వ బ్యాచ్‌కు శిక్షణ ఈ నెల 20వ తేదీన ప్రారంభించనున్నట్టు జిల్లా ప్రజారవాణా అధికారి విజయకుమార్ తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీఎస్‌ఆర్టీసీలో మాత్రమే హెవీ డ్రైవింగ్ స్కూల్ ఉందని, శిక్షణలో ఉత్తమ డ్రైవర్లుగా తీర్చిదిద్దడం జరుగుతోందని తెలిపారు. రాబోయే రోజుల్లో ఆర్టీసీలో డ్రైవర్లకు శిక్షణతో పాటు, హెవీ లైసెన్స్ ఐదేళ్లకు ఒకసారి రెన్యువల్ చేసుకునేటప్పుడు ఒక రోజు సర్టిఫికెట్ ఉండాలని, అది ఈ డ్రైవింగ్ స్కూల్ ద్వారా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి హెవీ లైసెన్సు రెవెన్యువల్‌కు వెళ్లే ప్రతీ ఒక్కరూ ఒకరోజు ట్రైనింగ్ తీసుకుని రవాణాశాఖ సర్టిఫికెట్ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 99630 91999, 7382923293 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

గరుడ వాహన సేవలో చక్రధరుడు


బెజ్జిపుట్టుగలో స్వామివారి ఊరేగింపు

కవిటి: బెజ్జిపుట్టుగ గ్రామంలో శ్రీచక్రధర పెరుమాళ్ల స్వామి డోలోత్సవాల్లో భాగంగా సోమవారం గరుడ వాహనసేవలో ఊ రేగింపు నిర్వహించారు. కవిటికి చెందిన బి.జగన్‌మిత్ర, శ్రీవల్లి దంపతులచే పూజా కార్యక్రమాలను నిర్వహించి తిరువీధి చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పి.కృష్ణారావు, రాంబాబు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ఇచ్ఛాపురం: ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొనేలా అవగాహన కల్పిస్తున్నట్టు ఏపీఎం సనపల ప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణ పరిధిలో గల బ్యాంక్‌లు, రైల్వేస్టేషన్, పోస్టాఫీస్ వద్ద ఓటుకి సంబంధించిన పోస్టర్లను అతికించి, అక్కడి వారికి ఓటు ప్రాధాన్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్యం తీసుకువస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఎన్నికల విధులకు పేర్లు నమోదు చేసుకోవాలి


ఎస్పీని కలిసిన మాజీ సైనిక ఉద్యోగులు

శ్రీకాకుళం క్రైం: సార్వత్రిక ఎన్నికల విధుల్లో చేరేందుకు మాజీ సైనిక ఉద్యోగులు స్వతహాగా ముందుకు రావాలని ఎస్పీ జీఆర్ రాధిక పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా సైనిక బోర్డులో సభ్యత్వం ఉన్న మాజీ సైనిక ఉద్యోగులతో ఎస్పీ ఎన్నికల విధులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో విధులు నిర్వర్తించేందుకు ఆసక్తి గల ఉత్సాహవంతులైన 60 ఏళ్లలోపు మాజీ సైనికులు స్వతహాగా వ్యక్తిగత వివరాలతో ఈ నెల 25వ తేదీ లోపు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. ఆరోగ్యంగా, శారీరకంగా దృఢంగా ఉంటూ ఎటువంటి క్రిమినల్ కేసులు లేని క్రమశిక్షణ కలిగిన మాజీ సైనికులను ఎన్నికల విధులకు తీసుకోనున్నట్టు తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ఎన్నికల విధులు పారదర్శకంగా నిర్వర్తించాలన్నారు. రెండు రోజుల పాటు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్ క్రమబద్ధీకరణ విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ జి.ప్రేమ్ కాజల్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎశైలజ, ఎస్‌బీ డీఎస్పీ త్రినాథరావు, జిల్లా మాజీ సైనికుల సమాఖ్య అధ్యక్షుడు పూర్ణచంద్ర, పి.ఈశ్వరరావు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ కవాతు



ఆమదాలవలస: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ముందస్తు అవగాహన కార్యక్రమంలో భాగంగా సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. సోమవారం ఆమదాలవలస ఎస్ఐ కె.వెంకటేష్ ఆధ్వర్యంలో ఒకే రోజు మూడు గ్రామాల్లో కేంద్ర బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు. వంజంగి, కనుగులవలస గ్రామాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని మెట్టక్కివలసలో పోలీసు కవాతు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని, చట్టాని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్ఐ హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

ఎన్నికల నియమావళి పాటించాలి

ఎచ్చెర్ల: ఎన్నికల నియమావళి పాటించాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.సుబ్బారావు ఆదేశించారు. ఎచ్చెర్లలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సోమవారం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సిబ్బందికి పలు సూచనలు చేశారు. షాపులు ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉండాలన్నారు. బార్ యజమానులు ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లం ఘిస్తే ఎక్సైజ్ శాఖ కంట్రోల్ రూమ్ నెంబరు 79893 43418కు సంప్రదించాలన్నారు. బెల్ట్‌షాపులు, అనధికారిక షాపులు ఉండరాదన్నారు. షాపుల్లో పనిచేసే సిబ్బంది రాజకీయ నాయకులతోను, పార్టీ సమావేశాలకు హాజరుకారాదన్నారు. సీఐలు కె.లక్ష్మి, ఐ.ఇందుమతి, ఎస్ఐలు పి.రాజగోపాల్, పీవీవీఎస్ఎన్ మూర్తి, ఎ.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా కణితి


లక్ష్మీబాయి

ఆమదాలవలస: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా సీనియర్ న్యాయవాది కణితి విజయ లక్ష్మీబాయి హ్యాట్రిక్ సాధించారు. ఆమదాలవలస బార్ అసోసియేషన్ పాలకవర్గ ఎన్నికలకు శుక్రవారం ఆమె నామినేషన్ వేయగా, మరెవరూ నామినేషన్ వేయకపోవడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు సోమవారం ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది సాధు ధనుంజయరావు ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా రమణమూర్తి, కార్యదర్శిగా ఎ.విజయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా బి.మోహన్‌రావు ఎన్నికయ్యారు. రాష్ట్రంలో బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా ఎన్నికైన తొలి మహిళా న్యాయవాది గా ఆమె గుర్తింపు పొందగా, ఇప్పుడు వరుసగా మూడుసారి కొనసాగడం గమనార్హం. ఈమె ఎన్నికపై పలువురు అభినందనలు తెలిపారు.

ఎన్డీఏ కూటమిదే విజయం

ఆమదాలవలస: రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అఖండ విజయం సాధిస్తుందని నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పేడాడ సూరపునాయుడు అన్నారు. సోమవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం సభ విజయవంతమే ఇందుకు నిదర్శనమన్నారు. పార్టీ నాయకులు చినబాబు, రామారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బెంతు ఒరియాల నిరసన


దీక్షలో కూర్చొన్న సంఘ నాయకులు

కవిటి: బెంతు ఒరియాలు కవిటిలో చేపట్టిన నిరసన దీక్ష సోమవారం 82వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వాలు మారుతున్నా మా బతుకులకు గుర్తింపు లభించడం లేదని ఆ సంఘ నాయకులు సుమన్ బిసాయి, రజనీకుమార్ దొళాయి, శ్రీకాంతపురియా ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం కుల గుర్తింపుకోసం నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక దీనస్థితిలో ఉండి, విద్యార్థులకు చదువులు కొనసాగకుండా మా బతుకులు ఉన్నాయన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి


లఘునాటికను విడుదల చేస్తున్న డైరెక్టర్

ఎచ్చెర్ల: విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథం అలవర్చుకోవాలని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ విభాగం-1,4 యూనిట్ల ఆధ్వర్యంలో సోమవారం ఎచ్చెర్ల, ఎస్ఎం పురం గ్రామాల్లో ప్రత్యేక సేవా శిబిరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఓఎస్డీ ఎల్.సుధాకర్‌బాబు, ఏవో ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, ఎఫ్‌వో అసిరినాయుడు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.ముకుందరావు, పీవోలు పాల్గొన్నారు. కాగా ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగంపై క్యాంపస్ అధ్యాపకుడు సూరి గణేష్ రూపొందించిన లఘునాటిక షార్ట్ ఫిల్మ్ లింక్‌ను డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ విడుదల చేశారు.

ఇంటర్‌నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గుర్తింపు



ఇచ్ఛాపురం: ఇంటర్‌నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో పట్టణానికి చెందిన పడాల పార్థివ్ శ్రీవత్సల్ రెండోసారి చోటు సంపాదించుకున్నాడు. స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న పార్థివ్ 1 నుంచి 100 వరకు గణాలను 4.24 నిమిషాల్లో రాసి బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కాడు. పార్థివ్ ప్రస్తుత వయస్సు 7సంవత్సరాల ఐదు నెలల 20 రోజులు. గతంలో 1 నుంచి 50 వరకు గణాలు అతివేగంగా రాయడంతో అంతర్జాతీయ రికార్డు పుస్తకంలో చేరాడు. పార్థివ్ తల్లిదండ్రులు అప్పలనాయుడు, లక్ష్మి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. కాగా పార్థివ్ ప్రతిభను పలువురు అభినందిస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఆమదాలవలస: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రాజకీయ పార్టీలతో పాటు ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమదాలవలస నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ హెచ్చరించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జేసీ విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. జూన్ 4న ఫలితాలు రానున్నాయని, అప్పటివరకు కోడ్ అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల డీటీ, నాలుగు మండలాల తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఆమదాలవలస: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కనుగులవలస, వంజంగి గ్రామ పోలింగ్ కేంద్రాలను సోమవారం శ్రీకాకుళం డీఎస్పీ వైశృతి పరిశీలించారు. సమస్యాత్మక గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ ముందస్తు చర్యల్లో భాగంగా పరిశీలిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ కవాతులు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీఐ జి.దివాకర్‌యాదవ్, ఎస్ఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బలవంతపు రిటైర్మెంట్ ఆపాలి

రణస్థలం: బలవంతపు రిటైర్మెంట్ ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శ్యాంక్రగ్ ఫిస్టన్స్ పరిశ్రమ ఎదుట సోమవారం కార్మికులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్ల సర్వీసు పూర్తయిందని బలవంతంగా రిటైర్మెంట్ చేయించడం సరికాదని, జేసీఎల్ ఆదేశాలు అమలు చేయాలని, అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎం.అప్పలనర్సయ్య, ఎం.కూర్మారావు, జె.రాము, గొర్లె కృష్ణ, రామారావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

వైసీపీని తరిమికొట్టేందుకు సిద్ధం

అరసవల్లి: జగన్‌రెడ్డి అవినీతి ప్రభుత్వాన్ని గద్దెదించి వైసీపీను తరిమి కొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. సోమవారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మంత్రులు అవినీతిలో పోటీ పడుతున్నారని, ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. ప్రజాగళం సభకు హాజరైన లక్షలాది జనసందోహం ప్రభుత్వంపై ఉన్న తీవ్ర వ్యతిరేకతకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. ఈ సభ ఘన విజయం టీడీపీ, జనసేన, బీజేపీల కూటమిదే అధికారం అని నిరూపించిందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ భాగస్వామ్య ప్రభుత్వాలు అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

బీఆర్‌ఏయూలో ఇంటర్వ్యూలు వాయిదా

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ నెల 21న నిర్వహించనున్న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు వాయిదా వేసినట్టు వర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్సిటీలోని 16 విభాగాల్లో 25 అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఒక అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి ఈ నెల 15న ప్రకటన జారీ చేశామన్నారు. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల కోసం ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటించడంతో ఈ ఇంటర్వ్యూలను వాయిదావేశామన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత ఇంటర్వ్యూల నిర్వహణ తేదీని తిరిగి ప్రకటిస్తామని పేర్కొన్నారు.

చెరువును పరిరక్షించండి

కొత్తూరు: కర్లెమ్మ పంచాయతీలోని తామర చెరువు ఆక్రమణలకు గురవుతోందని, వీటిని అరికట్టి చెరువును పరిరక్షించాలని కర్లెమ్మ సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్‌దాసు నాయుడు కోరారు. ఈ మేరకు సోమ వారం టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు ఫిర్యాదు చేశారు. తామర చెరువు 2.20 ఎకరాల విస్తీర్ణంలో కోట్లాది రూపాయల విలువ చేసే చెరువును ఆక్రమించేం దుకు బోనంగి లక్ష్మీనారాయణ, ఆనందరావు ప్రయత్నిస్తున్నారని, దీనిని నివారించాలని కోరారు. సబ్ కలెక్టర్‌ను కలిసిన వారిలో మాజీ సర్పంచ్ కన్నంనాయుడు, లోతుగెడ్డ తిరుపతిరావు, ఎద్దు శ్రీను, చోడవరపు గోవింద రావు తదితరులున్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం

గుజరాతీపేట: స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థులచే ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని సోమవారం నుంచి ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-1,2,3 క్యాంపులను పట్టణానికి అనుకుని ఉన్న దీపావళి, సొండిపేట, లంకపేటలో నిర్వహించారు. వారం రోజుల పాటు జరిగే కార్య క్రమంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. పీవోలు ఎస్.మాధవిలత, ఎస్.రుద్రమ రాణి, ఐ.హేమ పద్మజ, వైస్ ప్రిన్సిపాల్ శంకర నారాయణ, హెచ్ఎం జి.సూర్యనారాయణ, సీహెచ్ కృష్ణారావు, చిన్నారావు, కె.ప్రభాకరరావు, 150 మంది వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు

సరుబుజ్జిలి: దకరవలస గ్రామంలో నీలవేణి అమ్మవారి ఆలయంలో ఆమదాలవలస నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి తమ్మినేని సీతారాం సోమవారం పూజలు నిర్వహించారు. ఈ గ్రామంలో తమ్మినేని పూర్వీకులు ఈ ఆలయాన్ని నిర్మించారని, అప్పటినుంచి పూజలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. 2024 ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతారాం పార్టీ శ్రేణులతో గుడిలో పూజలు చేపట్టారు. అనంతరం దకరవలస, సుభద్రాపురం, సూర్యనారాయణపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు సత్యనారాయణ, నాగేశ్వరరావు, శివానందమూర్తి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా పదోన్నతి

ఇచ్ఛాపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ సుశాంత్‌కుమార్ జన్నా.. సీతంపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రోబిన్‌కుమార్ పాడితో పాటు అధ్యాపక బృందం సోమవారం అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసరావు, సంతోష్‌కుమార్, దుర్యోధన, శివకుమార్, త్రిపాఠి, పూర్వ ప్రిన్సిపాల్ నిత్యానంద పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.